# ఓటరు తీర్పుపై ఉత్కంఠ

- నేడే సార్వత్రిక ఎన్నికల ఫలితాలు
- గెలుపుపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు
- ఒకరికి ప్రతిష్టాత్మకం...హ్యాట్రిక్‌పై మరొకరి దృష్టి
- ఉత్కంఠగా నియోజకవర్గ ప్రజల ఎదురుచూపు
- మరికొన్ని గంటలలో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం



రేపల్లెలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

**రేపల్లె రూరల్:** నియోజకవర్గ ప్రజల ఉత్కంఠ భరిత ఎదురు చూపులకు నేడు తెరపడనుంది. రేపల్లె నియోజకవర్గానికి ఓటర్లు ఎవరికి పట్టాభిషక్తుడిని చేశారా అంటూ చిన్నా పెద్దలు, ప్రజా సంఘాలు, రాజకీయ జోస్యులు చేస్తున్న చర్చలకు నేటితో తెర పడనుంది. ఎన్నికల కమిషన్ గత నెల 13న నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలలో రేపల్లె నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో 14 మంది అభ్యర్థులు నిలవగా వీరిలో గుర్తింపు పొందిన పార్టీల నుంచి 11 మంది, స్వతంత్ర అభ్యర్థులుగా ముగ్గురు పోటీలో ఉన్నారు. ప్రధానంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా డాక్టర్ ఈవూరు గణేష్, టీడీపీ అభ్యర్థిగా అనగాని సత్యప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నుంచి మోపిదేవి శ్రీనివాసరావులు పోటీ పడి ప్రచారాలు నిర్వహించారు. మిగిలిన పార్టీలకు చెందిన అభ్యర్థులు సైతం ప్రచార కార్యక్రమాలు చేశారు. నియోజకవర్గంలో 2,27,232 మంది ఓటర్లకు గానూ 1,87,467 మంది ఓటు వినియోగించుకున్నారు. గత ఎన్నికలతో పోల్చితే పెరిగిన ఓటింగ్ ఎవరిని గెలిపించేనా అంటూ పలువురు చర్చించుకుంటున్నారు.

**ఎగ్జిట్ పోల్స్‌తో పెరిగిన జోష్**

ఇటీవల పలు సర్వే సంస్థలు ప్రకటించిన ఎగ్జిట్ పోల్స్‌లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ప్రకటించటంతో కేడర్‌లో జోష్ పెరిగింది. గ్రామీణ ప్రాంతాల వారు, మహిళలు అధిక శాతం వైఎస్సార్ సీపీకి ఓటు వేశారని సర్వే సంస్థలు ఇప్పటికే ప్రకటించాయి. దీంతో రేపల్లె నియోజకవర్గంలో పెరిగిన మహిళా ఓటింగ్‌తో వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్ విజయం సాధిస్తారని పార్టీ నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ గణేష్**

వైఎస్సార్ సీపీ అధిష్టానం రేపల్లె నియోజకవర్గాన్ని ఏవిధంగా నైనా కైవసం చేసుకోవాలని గౌడ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ ఈవూరు గణేష్‌ను తమ పార్టీ అభ్యర్థిగా నిలబెట్టింది. రాజకీయ కుటుంబ నేపధ్యం కలిగిన డాక్టర్ గణేష్ సైతం రేపల్లె నియోజకవర్గాన్ని గెలిచి వైఎస్సార్ సీపీ అధిష్టానానికి కానుకగా ఇవ్వాలని ఆశించారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు సహకారంతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను కలుపుకుని నియోజకవర్గంలో ముమ్మరంగా ప్రచార కార్యక్రమం చేశారు. గెలుపే లక్ష్యంగా శక్తి వంచన లేకుండా ప్రచారం నిర్వహించారు.

**టీడీపీ అభ్యర్థి అనగాని సత్యప్రసాద్**

టీడీపీ అభ్యర్థి అనగాని సత్యప్రసాద్ ఇప్పటికే రెండు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో గెలుపొంది హ్యాట్రిక్ సాధించాలన్న తపనతో టీడీపీ నాయకులు, కార్యకర్తలను కలుపుకుని ప్రచార కార్యక్రమాలు చేశారు. గెలుపు కోసం శత విధాలుగా ప్రయత్నాలు చేశారు.

**నేడు నియోజకవర్గంలో 144 సెక్షన్ అమలు**

ఓట్ల లెక్కింపు ప్రక్రియతో రేపల్లె నియోజకవర్గంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జిల్లా కలెక్టర్, ఎస్పీల ఆదేశాల మేరకు ఈ నెల 4, 5 తేదీలలో అధికారులు 144 సెక్షన్‌ను అమలు చేశారు. సోమవారం సాయంత్రం నుంచే ఈ సెక్షన్ అమల్లోకి వచ్చింది. ప్రజలు గుంపులు గుంపులుగా ఉండటం చేయరాదని తెలిపారు. దుకాణాలు సైతం మూసి వేయాలంటూ ప్రచారం నిర్వహించారు. దీంతో సాయంత్రం 5 గంటల నుంచి దుకాణాలు మూయించి వేశారు. అత్యవసర సేవలు మాత్రం యధావిధిగా కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లు తరలింపు

**రేపల్లె రూరల్:** సార్వత్రిక ఎన్నికలలో భాగంగా రేపల్లె నియోజకవర్గంలో పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు సంబంధించిన బాక్స్‌లను సోమవారం అధికారులు, ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థుల సమక్షంలో బాపట్ల స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులతో పాటు దివ్యాంగులు, 85 ఏళ్లు దాటిన వృద్ధులు, ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది వెరసి మొత్తం 4,207 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 4వ తేదీ మంగళవారం బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లను తరలించారు.

### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



**భట్టిప్రోలు:** సార్వత్రిక ఎన్నికల ఫలితాల వెల్లడిలో భాగంగా గ్రామాల్లో ఎటువంటి ఊరేగింపులు నిర్వహించవద్దని ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ పురస్కరించుకుని మంగళవారం 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలు ఊరేగింపులు నిర్వహించటం చట్టరీత్యా నేరమన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై ఆంక్షలు విధించినట్లు తెలిపారు.

### 213 మంది దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు



**నగరం:** మండల పరిధిలోని గ్రామాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన(దివ్యాంగులు) 213 మంది విద్యార్థులను గుర్తించినట్లు ఎంఈవో కొలసాని హరిబాబు చెప్పారు. పలు గ్రామాలలో సమగ్ర శిక్ష విభాగ సిబ్బంది నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాన్ని సోమవారం ఎంఈవో పర్యవేక్షించి మాట్లాడారు. 18 ఏళ్ల లోపు దివ్యాంగ విద్యార్థుల కోసం వారం నుంచి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 213 మందిని గుర్తించామని వెల్లడించారు. సర్వే కొనసాగుతుందన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు తగిన బోధనోపకరణాలు వినియోగించి వారికి విద్యను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ జ్యోత్స్న, రీసోర్స్ పర్సన్‌లు సురేష్, మోహనరావు పాల్గొన్నారు.

### 16 ఏళ్ల సమస్యకు చెక్‌పెట్టిన జీజీహెచ్ వైద్యులు



**గుంటూరు మెడికల్:** గుంటూరు జీజీహెచ్‌లో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు పుట్టుకతో వచ్చిన ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న 16 ఏళ్ల బాలుడికి చికిత్సచేసి కాపాడినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. సోమవారం సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ విభాగంలో బాలుడి తల్లిదండ్రులతో ఆపరేషన్ వివరాలను ఆయన వివరించారు. గుంటూరు నగరానికి చెందిన సాంబశివరావు, కాంచన దేవి దంపతుల పదహారేళ్ల కుమారుడు పుట్టుకతో రక్తపు వాంతులు, విరోచనాలు, రక్త హీనత, తరచూ జ్వరం, ఎదుగుదల లేకపోవడం వంటి లక్షణాలతో బాధ పడుతున్నట్లు తెలిపారు. పలు ప్రైవేట్ ఆస్పత్రుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో మే 16న గుంటూరు జీజీహెచ్ జనరల్ మెడిసిన్ ఓపీకి వచ్చారని పేర్కొన్నారు. వైద్యులు పరీక్షలు చేసి సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీకి రిఫర్ చేసినట్లు వెల్లడించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అందే కోటి వెంకటేశ్వర రావు రోగికి పరీక్షలు చేసి లివర్‌కు పేగుల నుంచి రక్తాన్ని తీసుకునే వెళ్లే నాళం(పోర్టల్ వీన్) మూత పడిందని గుర్తించారన్నారు. దీనివల్ల పేషంట్ ఆహారం సరిగా తీసుకో లేకపోవడం పెరుగుదల లేకపోవడం, ఈసోఫ్యాజియల్ వారిసిస్, రెక్టల్ వారిసేస్ వల్ల రక్తపు వాంతులు, విరోచనాలుతో బాధ పడుతున్నట్లు వివరించారు. పేషంట్ కు స్ప్లీన్ నెక్టమీ, డీ వాస్కులర్ సర్జరీ చేసినట్లు తెలిపారు. ఆపరేషన్ తరువాత బాలుడికి రక్తపు విరోచనాలు, వాంతులు తగ్గిపోయి, బ్లడ్ సెల్స్ పెరగడంతో ఆరోగ్యం మెరుగుపడిందని వెల్లడించారు.

### వృద్ధాశ్రమంలో అన్నదానం

**తెనాలిఅర్బన్:** శ్రీ వేంకటేశ్వర యోగా సేవా కేంద్రం సభ్యులు కారంపూడి నాగ వెంకట వీరాంజనేయులు, రమాదేవి దంపతుల సహకారంతో నాజర్‌పేటలోని 'మన ఇల్లు' వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్వీ యోగ కన్వీనర్ ముద్దాబత్తుని రమణయ్య మాట్లాడుతూ అనేక మంది దాతలు ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ధర్మేష్, శ్రీహరి, సాంబ్రాజ్యం, అనూష, ఆశ్రమ నిర్వాహకులు భారతి, మురళి, పలువురు యోగ సాధకులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న పింఛను కష్టాలు

**భట్టిప్రోలు:** అవ్వా తాతలు, ఇతర పింఛను దారులు జూన్ నెల పింఛన్ పొందాలంటే మరోసారి బ్యాంకు మెట్లు ఎక్కాల్సిన దుస్థితి నెలకొంది. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని చంద్రబాబు అండ్ కో అడ్డుకోవడంతో పింఛనుదారులు ఏప్రియల్ నుంచి ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. దాదాపు ఐదేళ్ల పాటు ఇంటి వద్దనే పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు తొలిసారిగా గత ఏప్రియల్ నెలలో సచివాలయాల మెట్లు ఎక్కాల్సి వచ్చి నానా ఇక్కట్లు పడ్డారు. మే నెల పింఛన్ల పంపిణీలో పచ్చ బ్యాచ్ మరో కుట్రకు తెర తీయడంతో అవ్వా తాతలు, దివ్యాంగులు చుక్కలు చూడాల్సి వచ్చింది. జూన్ నెల పింఛన్ల విషయంలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 75 శాతం లబ్ధిదారుల పింఛను వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. మిగిలిన మొత్తాన్ని శనివారం నుంచి సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేస్తున్నారు.

## క్లిష్టమైన ఆపరేషన్‌తో రోగి ప్రాణాలు నిలిపిన వైద్యులు



చికిత్స పొందిన వ్యక్తితో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

**గుంటూరు మెడికల్:** గుంటూరు జీజీహెచ్‌లో తొలిసారిగా సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు క్లిష్టమైన ఆపరేషన్ చేసి లివర్‌లోని రాళ్లు తొలగించి సరికొత్త చరిత్రను సృష్టించారని ఆస్పత్రి సూపరింటెండెంట్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం ఇన్‌చార్జి విభాగాధిపతి డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చెప్పారు. ఆపరేషన్ వివరాలను ఆయన సోమవారం మీడియాకు వెల్లడించారు. కృష్ణా జిల్లా పామర్రుకు చెందిన 57 ఏళ్ల రోగి కడుపు నొప్పి, జ్వరంతో బాధపడుతూ ఏప్రిల్ 26న గుంటూరు జీజీహెచ్‌లోని జనరల్ సర్జరీ ఓపీకి వచ్చారని చెప్పారు. సర్జరీ వైద్యులు వివిధ పరీక్షలు చేసి సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి రిఫర్ చేసినట్లు తెలిపారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అందే కోటి వెంకటేశ్వరావు రోగిని పరీక్షించి లివర్‌లో రాళ్లు ఉన్నట్లు గుర్తించారని చెప్పారు. ఎడమ లివర్‌లో రాళ్లు ఉన్నాయని రాళ్లు ఒక్కొక్కటి జారుతుండటం వలన కామెర్లు తరచూ వస్తున్నాయని వెల్లడించారు. లివర్‌లోనే రాళ్లు ఉండటం అనేది లక్షల్లో ఒకరికి మాత్రమే ఇలాంటి సమస్య వస్తుందని పేర్కొన్నారు. ఎడమ లివర్‌ను తొలగించి విజయవంతంగా ఆపరేషన్ చేసినట్లు చెప్పారు.

## వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు



చిట్టి ఆంజనేయ స్వామి

**తెనాలి:** స్థానిక షరాఫ్ బజార్లోని సువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకలు, హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం శ్రీ హనుమత్ గాయత్రి హోమం, 108 సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ, సాయంత్రం స్వామికి సింధూర అర్చన నిర్వహించారు. వైదిక క్రతువును వైఖానస పండితులు ఆగమోక్తంగా నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త ములుకుట్ల విశ్వనాథ శర్మ సుందరకాండ ప్రవచనం చెప్పారు. భక్తులు విశేషంగా పాల్గొని ఆంజనేయ స్వామికి ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు విశేషంగా పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. 'జయ హనుమాన జ్ఞాన గుణ సాగర' అంటూ భక్తి శ్రద్ధలతో హనుమాన్ చాలీసాని పటిస్తూ భక్తులు తమ భక్తిని చాటుతున్నారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకల్లో భాగంగా జూన్ 11 వరకు వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకలు, శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ ఉంటాయన్నారు. ప్రతిరోజు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ, స్వామికి విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేక అలంకరణతో, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్.బీ.శివ, నిఖిల్ శాండిల్య, కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సంకీర్తన సేవా సమితి సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, మడుపల్లి చంద్రశేఖర్, ఆర్ సురేష్ ,ఎం వెంకటేష్ ,కె రాజశేఖర్, బి లీలాప్రసాద్, గోలి సోమశేఖర్, గుండా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**ముగిసిన చిట్టి ఆంజనేయ స్వామి మహోత్సవాలు**

**తెనాలి:** స్థానిక బోసురోడ్డులోని హనుమాన్ చౌక్‌లో గల శ్రీ చిట్టి ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో శత జయంతి మహోత్సవాలు, హనుమజ్జయంతి వేడుకలు సోమవారంతో ముగిశాయి. ఉదయం స్వామి వారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సింధూర సహిత జంభీర ఫల సహస్ర నామార్చన నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు డాక్టర్ నోరి నారాయణ మూర్తి సుందరకాండ కథాగానం చేశారు. ఆలయ అర్చకులు దీవి యోగానంద చక్రవర్తి, దీవి వేణుమాధవ్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నిర్వహణ కమిటీ సభ్యులు విష్ణుభట్ల రత్నాకరశాస్త్రి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## సేంద్రియ ఎరువుల వాడకంతో మేలు

**భట్టిప్రోలు:** ప్రస్తుత వాతావరణ పరిస్థితులు దుక్కి దున్నుకోవడానికి ఉపకరిస్తాయని వ్యవసాయశాఖ అధికారి జి.మీరయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ లోతైన దుక్కులు దున్నుకోవడం వల్ల గత ఏడాది వేసిన పంటలలో అవశేషాలు, శిలీంద్రాలు, కీటకాలు భూమిపైకి వచ్చి నాశనం అయ్యేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నేల, ఆరోగ్య పరిరక్షణకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. భూసార పరీక్షలు చేయించడం, సేంద్రియ, పచ్చిరొట్ట, జీవన ఎరువులను వాడటం శ్రేయస్కరమన్నారు. పప్పు జాతి పంటలను చేర్చాలని, పంటల అవశేషాలను వినియోగించాలని, వ్యవసాయాధారిత పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలను వాడాలని సూచించారు.

### వైఎస్ జగన్ గెలుపును ఎవరూ ఆపలేరు

**నెహ్రూనగర్:** ప్రజల తీర్పుతో, దేవుడు ఆశీస్సులతో కూటమి నేతలు ఎన్ని కుట్రలు పన్నినా సీఎం వైఎస్ జగన్ తిరిగి ముఖ్యమంత్రి అవుతారని మాదిగ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పుసులూరి జీవా పేర్కొన్నారు. సోమవారం ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న అసోసియేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యున్నతే ధ్యేయంగా తన పాలన కొనసాగించిన వైఎస్ జగన్ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. పైకి మేకపోతు గంభీర్యం ప్రదర్శిస్తున్న కూటమి నేతలకు ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. జన రంజక పాలనే ధ్యేయంగా సాగిన జగన్ పాలనకు నేడు జరిగే కౌంటింగ్‌లో గతం కంటే అధికంగా వచ్చే సీట్లు అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

### పరుపుల దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్



**పట్నంబజారు:** విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పరుపుల దుకాణంలో అగ్నిప్రమాదం సంభవించిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన వివరాలు.. నల్లచెరువులోని లారీ స్టాండ్ సమీపంలో ఎం.రాధాకృష్ణమూర్తికి చెందిన దిండ్లు, పరుపుల తయారీ దుకాణం ఉంది. సోమవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించగా, వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా వేసినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

### ఆలయ భూముల కౌలు హక్కుల వేలం

**గుంటూరు ఈస్ట్:** గుంటూరు నగరంలోని లాలాపేట గ్రూపు దేవాలయాలైన జగన్నాథ స్వామి ఆలయం, శ్రీఆంజనేయస్వామి దేవస్థానం, వెంకటేశ్వరస్వామి దేవస్థానాలకు చెందిన పలు మండలాల్లోని వ్యవసాయ భూములను మూడు సంవత్సరాలకు బహిరంగ వేలం వేస్తున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ డి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదకాకాని మండలంలోని నంబూరు గ్రామంలో జూన్ 12వ తేదీ వేణుగోపాలస్వామి ఆలయం ప్రాంగణంలో, జూన్ 15న ఉప్పలపాడు గ్రామం శివాలయంలో, చేబ్రోలు మండలంలోని వేజెండ్ల గ్రామంలో జూన్ 14న గ్రామ శివాలయంలో, ఫిరంగిపురం మండలంలో వేమవరం గ్రామంలో జూన్ 13న పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని కోరారు.

## శ్రీ కృష్ణలీలలు ధారావాహిక ప్రవచనం ప్రారంభం



మాట్లాడుతున్న కైలాసనాథ్

**నగరంపాలెం:** స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మూడు రోజులపాటు నిర్వహించనున్న శ్రీమద్భాగవతం- దశమస్కంధం- శ్రీకృష్ణలీలలు ధారావాహిక ప్రవచనం సోమవారం ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆధ్యాత్మికవేత్త మల్లాది కైలాసనాథ్ ప్రసంగిస్తూ భగవంతుని చేష్టలను లీలలు అంటారని పేర్కొన్నారు. సామాన్య మానవునికి ఎదురయ్యే కష్టాలకు కొన్ని వేల కష్టాలు శ్రీకృష్ణుని జీవితంలో ఎదురైనట్లు తెలిపారు. అనేక మంది రాక్షసులు శ్రీకృష్ణుని సంహరించేందుకు వచ్చారని పేర్కొన్నారు. శ్రీకృష్ణుడు వారందరికి ముక్తిని ప్రసాదించారని వివరించారు. తన లీలల ద్వారా పాడి, పంట, పశు పోషణ, పల్లె జీవనం తదితర వాటి ప్రాముఖ్యత, ఆవశ్యకతను లోకానికి చాటి చెప్పాడని అన్నారు.

## మోకాళ్లతో చర్చి మెట్లు ఎక్కిన దివ్యాంగులు

**సీఎం జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రార్థనలు**

**బాపట్ల:** రాష్ట్రానికి రెండోసారి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ దివ్యాంగుల సంఘం నాయకులు చల్లా రామయ్య ఆధ్వర్యంలో దివ్యాంగులు చర్చి మెట్లు ఎక్కారు. సోమవారం సాయంత్రం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాలకు మంచి జరుగుతుందని చల్లా రామయ్య పేర్కొన్నారు. ఆయనకు దేవుని ఆశీర్వాదాలు మెండుగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గుంజి ఏడుకొండలు, మల్లెల మౌనిక, మద్దిబోయిన శ్రీనివాసరావు, కత్తి లక్ష్మి, అక్కల కృష్ణారెడ్డి, మొద్దు నాగేంద్రమ్మ, కనపర్తి మణెమ్మ, పులిపాటి సౌజన్య, కుక్కల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



మోకాళ్లతో చర్చి మెట్లు ఎక్కుతున్న దివ్యాంగులు

## లెక్కింపు ప్రక్రియ విజయవంతం చేయాలి

**ఆర్వో లక్ష్మీకుమారి**



పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లను తరలించేందుకు స్ట్రాంగ్ రూం తెరుస్తున్న ఎన్నికల అధికారులు

**పొన్నూరు:** ఎన్నికల నిబంధనలు పాటిస్తూ మంగళవారం జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని పొన్నూరు నియోజకవర్గం ఆర్వో లక్ష్మీకుమారి అన్నారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లెక్కింపు హాలులోకి చరవాణులు తీసుకురాకూడదని సూచించారు. పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 264 పోలింగ్ బూత్‌ల లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 19 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఫలితాల అనంతరం అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు 2,991 పోస్టల్ బ్యాలెట్‌లు వచ్చినట్లు తెలిపారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచిన పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లను గట్టి బందోబస్తుతో ఏఎన్‌యూకు తరలించారు. సమావేశంలో ఏఆర్వో సూర్యనారాయణ సింగ్, జెడ్పీటీసీ సభ్యుడు కర్లపూడి రమేష్, వడ్రాణం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మద్రాస్ ఐఐటీని సందర్శించిన హైస్కూలు విద్యార్థులు



విద్యావేత్త నంబూద్రితో సీతారామయ్య స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయిని శివనాగ మల్లీశ్వరి

**గుంటూరు ఎడ్యుకేషన్:** మద్రాస్ ఐఐటీలో మే 20 నుంచి 26వ తేదీ వరకు స్పిక్‌మెకే పేరుతో నిర్వహించిన అంతర్జాతీయసదస్సులో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలకు చెందిన విద్యార్థినులు హాజరైనట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో విష్ణువర్ధన్ మాట్లాడుతూ మద్రాస్ ఐఐటీ సందర్శన సందర్భంగా పలువురు ప్రముఖ కళాకారులను కలుసుకున్న తమ పాఠశాల విద్యార్థులు వారి అనుభవాలను పంచుకున్నారని పేర్కొన్నారు. సమయపాలన, మంచి నడవడిక, మంచి అలవాట్లు, దేశం పట్ల ప్రేమ, భక్తి వంటి ఎన్నో విషయాలలో అవగాహన కల్పించారన్నారు. దేశ, విదేశాల నుంచి పాల్గొన్న విద్యావేత్తలు, కళాకారులు, ప్రముఖులతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులతో తమ పాఠశాల విద్యార్థులు పరస్పర భాషా, సాంస్కృతిక, విజ్ఞానాలను పంచుకున్నారని అన్నారు. విద్యార్థినులతో పాటు ఉపాధ్యాయిని వాసిరెడ్డి శివనాగ మల్లీశ్వరి పర్యటనలో ఉన్నారు.

## ఏపీ ఈసెట్ ఫలితాల్లో 'హిందూ' ఫార్మసీ ప్రతిభ



విద్యార్థులతో జూపూడి రంగరాజు, నాగభూషణం, ప్రత్యూష తదితరులు

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఇటీవల ప్రకటించిన ఏపీ ఈసెట్ ఫలితాల్లో హిందూ ఫార్మసీ కళాశాల డీ ఫార్మసీ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మెరుగైన ర్యాంకులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వీ నాగభూషణం తెలిపారు. సోమవారం అమరావతి రోడ్డులోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో నాగభూషణం మాట్లాడుతూ కోలా జయబాలశ్రీ 77వ ర్యాంకు, రావర్ల అమర్ 192వ ర్యాంకు, నూతక్కి ప్రభావతి 212వ ర్యాంకు, రౌతు ధాత్రి 287వ ర్యాంకు, ఏటుకూరి విజయ 293వ ర్యాంకులతో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటారని పేర్కొన్నారు. ఈసందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ ప్రత్యూష, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, డీ ఫార్మసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ వి.వాసు నాయక్, అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## షిరిడీ సాయినాథ మందిరంలో వార్షిక బ్రహ్మోత్సవాలు



సాయిబాబా వారికి ప్రత్యేక జలాలతో అభిషేకం



ఆలయంలో నృత్యప్రదర్శన

**నగరంపాలెం:** స్థానిక హౌసింగ్‌బోర్డ్‌కాలనీ షిరిడీ సాయినాథ మందిరంలో 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం మంగళ ధ్వని, గణేష్ స్తుతి, కాకడ హారతి, రుద్ర నమక చమకాలతో నిత్యాభిషేకం, అష్టోత్రం సహస్రనామ పూజలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం సత్సంగ సభ్యులు, భక్తులు 108 కలశాల్లోని ప్రత్యేక జలాలతో బాబా వారికి అభిషేకం చేశారు. సాయంత్రం నాట్యాంజలి కూచిపూడి నృత్యాలయం(విజయవాడ గొల్లపూడి) మాగులూరి త్రినాధ చారి శిష్య బృందం కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. తొలుత బాబా వారి చిత్రపటం వద్ద విశ్వ సంకీర్తన చార్య తుర్లపాటి శంభయ్యాచార్య జ్యోతి ప్రజ్వలన చేయగా, ఆలయ అధ్యక్షులు మామిడి సీతారామయ్య, గౌరవ అధ్యక్షులు మామిడి రామారావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

### విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని కలిగించే విధంగా మ్యూజికల్ చైర్స్ ఆడించారు. గ్రంథాలయాధికారి ఎస్. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విజ్ఞానదాయక అంశాలను చెప్పారు.